# 6

# దేవుడు నరరూపు దాల్చాడు

క్రొత్త నిబంధన యొక్క తొలి నాలుగు పుస్తకాలు (మత్తయి, మార్కు, లూకా, యోహాను) ఎన్నడూ చెప్పబడనంత ఆశ్చర్యకరమైన కథను చెప్తాయి. దేవుడు ఎలా నరరూపు దాల్చాడో అవి మనకు విప్పి చెప్తాయి. దేవుని కుమారుడైన యేసుక్రీస్తు మానవుడుగా ఈ లోకములో ప్రవేశించి, మన పాపముల కొరకు మరణించి, ఎవరు వాటిని స్వీకరిస్తారో వారికొరకు – రక్షణను, లేక మన పాపక్షమాపణను, నిత్యజీవమును తెచ్చాడని అవి చెప్తాయి.

క్రొత్త నిబంధన రక్షణను గూర్చిన చక్కని పరిశీలనయైనంతగా అది చరిత్ర గ్రంథం కాదు. దైవికమైన దేవుని కుమారుడు మనలను రక్షించడానికిగాను ఎలా నరరూపు దాల్చాడో తెలియజేయడమే దాని ప్రధాన భావమైయున్నది. అందువలన, మత్తయి, మార్కు, లూకా, యోహాను కేవలం మన ప్రభువు యొక్క జీవితానికి సంబంధించిన పార్శ్య భాగాలు మాత్రమే కావు. ఎక్కువగా అవి మిషినెరీ వర్తమానాలను పోలి ఉన్నాయి. మానవునికి రక్షణను తెచ్చిన సంఘటనలకు సంబంధించిన కీలకమైన సంఘటనలను మనకు తెలుపుతూ, "ఏరి కోరుకున్న చరిత్రను" అవి మనకు ప్రసాదిస్తాయి. అందునుబట్టి యోహాను 21:25 యిలా అంటుంది, "యేసు చేసిన కార్యములు ఇంకను అనేకములు కలవు. వాటిలో ప్రతిదానిని వివరించి వ్రాసినయెడల అట్లు వ్రాయబడిన గ్రంథములకు భూలోకమైనను చాలదని నాకు తోచుచున్నది."

ప్రభువైన యేసు మనకు రక్షణను ప్రసాదించడాన్ని గూర్చి క్రొత్త నిబంధనలో చెప్పబడిన కొన్ని ప్రధాన ఘటనములేవి? క్రీస్తు యేసును గూర్చిన సత్యమేమి?

## యేసు దేవుడై ఉండెను/ ఉన్నాడు

ప్రభువైన యేసును గూర్చి మనమంగీకరించవలసిన తొలి సత్యం: ఆయన దేవుడై

యుండెను మరియు ఉన్నాడు.

ఆయన జన్మయే ఆయనకు ప్రారంభమా? లేదు. బేత్లెహేములో మన ప్రభువు జన్మ ఆయన ఉనికికి ఆరంభము కాదు. ఆయన జన్మ కేవలం భౌతిక శరీరాన్ని దాల్చి మానవుడుగా ప్రత్యక్షుడవ్వడం మాత్రమే.

"దేవుడు" లేక దేవత్వమనేది ఒక విధంగా కుటుంబపు పేరు వంటిదే. నీ కుటుంబపు పేరు కుటుంబములోని యితర సభ్యులతో ఏకత్వం చేస్తుంది. అది కుటుంబములోని వ్యక్తిగతమైన సభ్యులను ఒకే కుటుంబపు యూనిట్‌గా కలిపే లింకు అయ్యింది. అలాగే దేవుడు లేక దేవత్వము అనేది కుటుంబ నామము. లేఖనాల్లో తండ్రియైన దేవుడు, కుమారుడైన దేవుడు, పరిశుద్ధాత్మ దేవుడు అన్నట్టు మనం చూస్తాం. దేవత్వంలోని రెండవ వ్యక్తియైయున్న యేసు, మన కొరకు మానవుడయ్యాడు.

ప్రభువైన యేసు నిత్య దేవుడైయున్నట్టు స్పష్టంగా ప్రకటించే ఒక లేఖన భాగము యోహాను 1:1–5.[1] యేసు దేవుడైయున్నాడు ఎల్లప్పుడు ఆయన దేవుడుగా ఉన్నాడని యోహాను అంటున్నాడు.

> ఆదియందు వాక్యముండెను,[2] వాక్యము దేవునియొద్ద ఉండెను, వాక్యము దేవుడై యుండెను. ఆయన ఆదియందు దేవునియొద్ద ఉండెను. సమస్తమును ఆయన మూలముగా కలిగెను, కలిగియున్నదేదియు ఆయన లేకుండ కలుగలేదు. ఆయనలో జీవముండెను; ఆ జీవము మనుష్యులకు వెలుగైయుండెను. ఆ వెలుగు చీకటిలో ప్రకాశించుచున్నది గాని చీకటి దాని గ్రహింపకుండెను.

ఈ లేఖన భాగమునుండి వెలువడే నాలుగు గొప్ప సత్యాలను మనం ఆలోచింప వలసియుంది:

1. ప్రభువైన యేసు సృజింపబడినవారు కారు. ముందటి ఉనికి లేకుంటే ఆయన నరరూపు ఎలా దాల్చగలరు? జన్మకు (ఉనికికీ) ఆరంభానికి వ్యత్యాసమున్నట్టు మరి ఏ యితర వ్యక్తిని గూర్చి మనం చూడలేము, లేదా అతడు గర్భములో పడినప్పుడు అతని జీవితం ఆరంభం కాలేదని మరెవరిని గూర్చి చెప్పలేం, కాని క్రీస్తు ప్రభువును గూర్చి మాత్రమే అలా చెప్పగలం. ఆయన జన్మ సమయంలో గాని, మృతులలోనుండి లేచినప్పుడుగాని ఆయన దేవుని కుమారుడైనవాడు కాదు. ఆయన దేవుడు, సర్వోన్నతుడు, మరియు ఆరంభమన్నది లేనివాడు. ఆయన ఎల్లప్పుడు ఉన్నాడు, ఎల్లప్పుడు ఉంటాడు.

లోకము పుట్టకమునుపే తండ్రియొద్ద తనకు మహిమయున్నట్టు ఆయన పలికాడు (యోహాను 17:5). "... నేను దేవునియొద్దనుండి బయలుదేరి వచ్చితినని...నేను

తండ్రియొద్దనుండి బయలుదేరి లోకమునకు వచ్చియున్నాను ...” (యోహాను 16:27, 28). “జగత్తు పునాది వేయబడకమునుపే నీవు నన్ను ప్రేమించితివి” అని కూడా ఆయన అన్నారు (యోహాను 17:24బి). తక్కిన ప్రతి వ్యక్తియు భౌతిక జన్మ ద్వారా జీవితంలోనికి ప్రవేశించాడు, కాని, ప్రభువైన యేసైతే జీవిత దినాలకు ఆదియైనను జీవమునకు అంతమైనను లేనివాడైయున్నాడు (హెబ్రీ.7:3). ఆయన సంపూర్ణంగా నిత్యుడు, సంపూర్ణంగా దేవుడే.

మనవలె కాక, అతడు పుట్టాలని కోరుకున్నాడు, జీవితం యొక్క అనుభవంలో ప్రవేశించాలనుకున్నాడు. ఆయన భూనివాస జీవితంలో, ఆయన దేవత్వాన్ని ప్రక్కన పెట్టలేదు, కాని దేవుని విశేషమైన లక్షణాలను మాత్రమే తనకు తానే కోరుకుని ప్రక్కనపెట్టాడు. ఏ సమయంలోనైనా, తన దైవికమైన శక్తులను ఉపయోగించుకొని యుండేవాడే లేదా తనకున్న దైవికమైన కోర్కెలను వాడుకొని యుండేవాడే (ఫిలిప్పీ. 2:6).

2. దేవుడు ప్రభువైన యేసు ద్వారా లోకాన్ని సృజించినట్టు మనం చూస్తాం. ఆయన విశ్వానికే నిజంగా ప్రభువైయున్నాడు. “అయినను ...మనకు ఒక్కడే దేవుడున్నాడు. ఆయన తండ్రి; ఆయననుండి సమస్తమును కలిగెను; ఆయన నిమిత్తము మనమున్నాము. మరియు మనకు ప్రభువు ఒక్కడే; ఆయన యేసు క్రీస్తు; ఆయనద్వారా సమస్తమును కలిగెను; మనము ఆయనద్వారా కలిగినవారము” అని 1 కొరింథీ. 8:6 అంటుంది. కొలస్సీ. 1:16 కూడా ఈ విషయాన్ని తెలుపుతున్నాయి: “ఏలయనగా ఆకాశమందున్నవియు, భూమియందున్నవియు, దృశ్యమైనవిగాని, అదృశ్యమైనవిగాని, అవి సింహాసనములైనను ప్రభుత్వములైనను ప్రధానులైనను అధికారములైనను, సర్వమును ఆయనయందు సృజింపబడెను, సర్వమును ఆయనద్వారాను ఆయనను బట్టియు సృజింపబడెను.”

3. జీవులకు ప్రాణ ప్రాప్తిని ప్రసాదించేవాడు ప్రభువైన యేసే అయ్యున్నట్టు మనం చూస్తాం, మరియు ఆయన మృతులను సహా లేపగలవాడైయున్నాడు (యోహాను 11:25 చూడు). ఆయన జీవాధిపతి.

4. ఆయన జీవ మరణములకు ప్రభువైయున్నట్టు మనం నిర్ధారణ చేయాలి. ఆయన సమస్తాన్ని చేశాడు, వాటి విషయం అక్కర కలిగియుంటాడు, జీవాన్ని ప్రసాదిస్తాడు మరియు మరణంపై ఏలికయైయుంటాడు.

మన ప్రభువు యొక్క భూ నివాస కాలపు జీవితంలో ప్రతిదీ మనం గ్రహించగలమా? వాస్తవంగా, మనం తెలిసికోలేం. నరుడు దేవుని సంపూర్ణంగా ఎలా అర్థం చేసికోగలడు? దాన్ని నమ్మడానికిగాను ఒక సత్యాన్ని ఒకడు సంపూర్ణంగా గ్రహించనవసరంలేదు.

దేవుడు భూమిని ఎలా సృజించాడో అనేది నాకు అగోచరం, కాని ఆయన దాన్ని సృజించినట్టు నేను నమ్ముతున్నాను. ప్రభువైన యేసు మృతులలోనుండి ఎలా లేచాడో నేను గ్రహించలేను, అయితే ఆయన లేచినట్టు నేను నమ్ముతున్నాను. అలాగే దేవుడైయున్న యేసు క్రీస్తు, ఎలా నరరూపు దాల్చాడో నేను గ్రహించలేను, కాని ఆయన అలా దాల్చినట్టు నేను నమ్ముతాను.

## దేవుని కుమారుడైన యేసు నరరూపు దాల్చాడు

ప్రభువైన యేసునుగూర్చి మనం ఆలోచింపవలసిన తరువాత సత్యమేమంటే, ఆయన సంపూర్ణంగా నరుడయ్యాడు. దేవుని కుమారుడైన యేసు రక్తమాంసాలను ధరించాడనే సత్యాన్ని మన మనస్సుల్లో దూరేలా చేద్దాం! ప్రభువైన యేసు నిన్న, నేడు, నిరంతరము దేవుని కుమారుడై యున్నాడు; అయితే ఆయన జన్మనెత్తినప్పుడు మనుష్య కుమారుడయ్యాడు.

భూలోకానికి దిగివచ్చుటలో ఆయన పరలోకాన్ని ఎలా విడిచిపెట్టాడో పౌలు వర్ణించాడు (ఫిలిప్పీ. 2:5-8). మనలో ఒకనివంటివాడుగా అవతరించడానికి ప్రభువైన యేసు ఎలా దిగివచ్చాడో గమనించు.

మొదటిగా, ఆయన పరలోకాన్ని విడిచిపెట్టాడు, తన తండ్రి ప్రసన్నతలో ఉన్న విలువైన ప్రేమను వదలుకున్నాడు. ద్వేషమేమియు లేని స్థలంనుండి - అసూయ, రోషము, అనుమానము అనేవి ఏవీ లేని చోటునుండి వచ్చేశాడు. భేదము, సంఘర్షణలు, లేక వివాదములు లేని పరలోకము యొక్క రమ్యమైన ఐక్యమత్యాన్ని ఆయన వదలుకున్నాడు; అపార్థాలుగాని లేదా కలతగాని అక్కడ ఉండేవి కావు. సమృద్ధియైన పరలోకపు సౌభాగ్యాన్ని ఆయన విడనాడినాడు. ఆకలి దప్పులుగాని, లేమి లోటుగాని పేదరికముగాని లేని చోటును ఆయన వదలివేయడానికి యిష్టపడ్డాడు.

రెండవదిగా, ఆయన నరమాత్రుడయ్యాడు. ఆయన జన్మ ఆయన ఆదిని సూచించదు గాని, ఆయన మానవ ప్రత్యక్షతను సూచిస్తోంది. కాలమనే రంగస్థలంలోని ఆయన మానవ ప్రత్యక్షతను సూచిస్తోంది. నిత్యత్వము, కాలము కలిసే చోటుగాను, దేవత్వము మానవత్వము పరిపూర్ణంగా మిశ్రమ స్థానముగాను, పరలోకము భూలోకములకు కలయికగాను ప్రభువైన యేసు ఉన్నాడు. ఆయన జన్మించడానికి మాత్రమేగాక, మరణించునట్లు ఆయన సంపూర్ణమైన మానవుడై యుండడానికి కూడా యిష్టపడ్డాడు. దేవుడుగా, ఆయన మానవుడయ్యాడు. ఆయన దేవుని కుమారుడై

యుండియు, మనుష్య కుమారుడయ్యాడు.[3]

ఇది క్రైస్తవ్యం యొక్క మహత్తరమైన సత్యము. నీవు ఈ సత్యాన్ని నమ్మగలిగి నట్లయితే, అప్పుడు క్రైస్తవ్యంలోని మిగిలిన ప్రతి సత్యాన్ని నీవు నమ్మగలవు. అవును, క్రైస్తవ్యంలో ఊగిసలాడించే సత్యం ఏదంటే – నజరేయుడగు యేసు (అనే వ్యక్తి) నరుడుగా చేయబడిన దేవుడై యుండెను. దేవత్వాన్ని పోగొట్టుకోకుండ ఆయన నరరూపు దాల్చాడు, ఆయన నిజంగాను, సంపూర్ణంగాను ఎలా దేవుడో అలాగే ఆయన నరుడై యున్నాడు. క్రైస్తవ్యంలో ఈ భాగాన్ని నమ్మగలిగే వానికి, మిగిలిన దానిని నమ్మడంలో ఏ యిబ్బంది ఉండదు.

"ఆ వాక్యము శరీరధారియై, కృపా సత్య సంపూర్ణుడుగా మనమధ్య నివసించెను" అని యోహాను వ్రాశాడు (యోహాను 1:14ఎ). మరో విధంగా చెప్పాలంటే, దేవుడు మానవుడయ్యాడు; దేవుని కుమారుడు యూదుడయ్యాడు; సర్వశక్తుడు భూమిమీద నిస్సహాయుడైన మానవ శిశువుగా ప్రత్యక్షుడై, తన పడకమీద పరుండి, తేరిచూస్తూ, (చేతులు) నులిపికొంటూ, శబ్దాలు చేయడాన్ని మించి మరేమి చేయలేనివాడుగా నిలిచాడు. ఆయన పోషింపబడవలసియున్నాడు, బట్ట మార్చవలసినవాడై, మిగిలిన ఏ యితర బిడ్డవలెను ఆయన మాట్లాడ నేర్పింపవలసినవాడుగా ఉన్నాడు. ఇది భ్రమయో లేక మోసమో కాదు; దేవుని కుమారుని బాల్యదశ వాస్తవమై యున్నది. దాన్ని గూర్చి ఎంత ఎక్కువగా ఆలోచిస్తుంటే, అంత ఎక్కువగా అది ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. ఆయన నరరూపు దాల్చి దానిలో వారికున్న అవిశ్వాసము లేదా కనీసం సరిపోని విశ్వాసమే సువార్త కథనంలోని యితర సత్యాలను నమ్మడానికి జనులు కష్టపడుతున్నారు. నరావతారము నిజమని గ్రహించినప్పుడు, తక్కిన అడ్డంకులు తొలిగిపోతాయి.[4]

మూడవది, ఆయన మనుష్యుల దాసుడయ్యాడు. ఆయన రాజగృహంలో ఒక రాజుగా జీవించలేదు, కాని దాసుడుగా పేదరికంలో పొర్లాడాడు. సేవ చేయించు కొనుటకు కాదు, సేవ చేయడానికే ఆయన వచ్చాడు. దేవుడు ఎలాటివాడో, నిజమైన మానవత్వం ఎలాటిదో ఆయన ప్రదర్శించడానికి అవతరించాడు (మార్కు 10:45).

నాల్గవది, ఆయన మరణానికి లోబరచుకున్నాడు. మరణానికి లోబరచు కొనకుంటే, ఆయన సంపూర్ణంగా నరుడైయుండేవాడు కాదు. హీనాతి హీనమైన మరణం, సిలువ మరణానికే ఆయన తన్ను తాను లోబరచుకున్నాడు. నేను నా నిద్రలో మరణించ కోరతాను. మరి నీవో? ఈ పంథాలో మనం ప్రభువైన యేసులా లేము. చిత్రహింసలతో కూడిన బాధకరమైన మరణానికి ఇష్టపూర్వకంగా, బలవంతమేమియు లేకుండగనే, తనంతట తాను అప్పగించుకున్నాడు.

## ఆయన మనమధ్య దైవ - మానవుడుగా నివసించాడు

ప్రభువైన యేసును గూర్చి మనం ఆలోచించవలసిన మరొక సత్యం – ఆయన దైవ మానవుడుగా మనమధ్య నివసించాడు.

దేవ–మానవుని యొక్క భూ నివాస జీవితం బహు అసాధారణమైయుంటుందని మనం కనిపెడతాం. దేవ మానవుడు ప్రజలందరికి వేరైనవాడైయుంటాడు. ఆయన భూ నివాస జీవితం ఎన్నడు జీవించిన ఏ మానవునికంటెను అధికమైనదిగా (లేక మిన్న యైనదిగా) మత్తయి, మార్కు, లూకా, యోహానులు తెలిపితే మనం ఆశ్చర్యపడ నవసరంలేదు.

దేవుడు మనుష్యుడుగా రావాలంటే, ప్రత్యేకమైన జన్మ అవసరమైయుంటుంది. ఆయనకు అలాటి జన్మ ఉంది: మరియ అను పేరుగల ఒక కన్యకు ఆయన జన్మించినట్టు మత్తయి, లూకా అనే సువార్త రచనలు తెలుపుతున్నాయి. ఆయనకు భూసంబంధమైన తల్లి యుందిగాని, భూసంబంధమైన తండ్రిలేదు. ఏలయనగా, అతని తల్లి ఆయనను పరిశుద్ధాత్మవలన గర్భం ధరించింది (మత్తయి 1:20).

ఆయన జీవితం పరిపూర్ణమైనదై యుండాలని మనం నిరీక్షిస్తాం, మర్త్యుడగు నరమాత్రునినుండి వచ్చినవికాక, దైవికమైన బోధలచే అది చక్కగా తెలియదగినదై యుంటుందని మనం కనిపెడతాం. ఆయన మాట్లాడినట్టు ఎవడును ఎన్నడును మాట్లాడలేదన్న సంగతిని మనం చదవడంలో ఆశ్చర్యపడనక్కరలేదు (యోహాను 7:46). ఆయనను కలిసికొన్న జనులు, ఆయన సందేశాన్ని విన్న ప్రజలు ఆయన జీవితాన్ని బట్టి సందేశాలను బట్టి ఆశ్చర్యపడ్డారు.

ఆయన సశరీరుడైన దేవుడైయున్నట్టయితే, మానవాతీతంగా తన శక్తిని ప్రదర్శించి మహత్కార్యాలను, అద్భుతాలను చేశాడంటే, ఆశ్చర్యపడవలసిన అవసరమేముంది? ప్రకృతి చట్టాలకుపైగాను, అతీతంగాను ఉన్నట్టు తన శత్రువులు సహితము భావించిన స్పష్టమైన అద్భుతాలను ఆయన చేసినట్టు మనం చెప్పబడ్డాం. ఆయన చనిపోయినవారిని బ్రతికించాడు (యోహాను 11:43, 44), గుడ్డివారిని బాగు చేశాడు (మార్కు 8), రొట్టెలను చేపలను విస్తరింపజేశాడు (యోహాను 6). ఆయనకు అలాటి శక్తియుండడంలో మనకు వింతగా తోచనవసరం లేదు. ఆయన సమస్తాన్ని సృజించాడు, సమస్తాన్ని పోషించుతున్నాడు.

ప్రపంచ చరిత్రలో ఆయన మరణం సహా ప్రత్యేకమైనదై యుంటుందని మనం ఎదురు చూస్తాం కదా? దేవుడు సిలువ మీద చనిపోవడం అనేది కాలమంతటిలోను

ఆశ్చర్యకరమైన సంఘటనగా నిలిచియుంటుంది. ఇలాగే జరిగినట్టు సువార్త రచనలు సూచిస్తున్నాయి. ప్రభువైన యేసు మరణ సమయంలో, ఆకాశము నలుపుగా మారిపోయింది, భూమి కంపించింది, దేవాలయపు తెర పైనుండి క్రిందికి చినిగింది, మరియు సమాధులు తెరువబడ్డాయి, నిద్రించిన అనేకమంది పరిశుద్ధుల శరీరములు లేచెను, ఆయన లేచిన తరువాత యెరూషలేములో ప్రవేశించి అనేకులకు అగపడ్డారు (మత్తయి 27:50-53). దేవ-మానవుడు చనిపోయినప్పుడు ఒక ప్రత్యేకమైన సంఘటన సంభవించింది. ఆ సంఘటన జగత్తు పునాది వేయబడకమునుపే ఏర్పరచబడింది.

దేవ-మానవునికి మరణంపై కూడా అధికారముంటుందని మనం ఎదురు చూడమా? నిజంగానే, ఆయన మృతులలోనుండి లేచాడు. ఆయన జీవితాన్ని గూర్చి మనకు చెప్పబడిన సత్యాల్లో ఈ సత్యం మాత్రం చాలా స్పష్టంగా తెలుపబడింది. ఆయన పునరుత్థానాన్ని గూర్చి నలుగురు సువార్త లేఖకులు బహు వివరంగా వర్ణించారు. ఆయన మన పాపముల నిమిత్తము తన్ను తానే అప్పగించుకొన్నాడు, కాని ఆయన నిజముగా దైవమైయున్నాడని మనం ఎరుగునట్లు ఆయన మృతులలోనుండి లేచాడు.

## ముగింపు

ప్రభువైన యేసునుగూర్చి మనం ఎన్నడు మరువకూడని మూడు సత్యాలు యిక్కడున్నాయి: ఇంతకు మునుపును నేడును ఆయన దేవుడైయున్నాడు, ఆయన నరుడుగా అవతరించాడు, ఆయన మన మధ్య దేవ-మానవుడుగా జీవించాడు.

ప్రభువైన యేసును గూర్చిన ఈ మూడు సత్యాలు రెండు విధాలుగా మనలను ప్రోత్సహించవచ్చు. మొదటిది, మన రక్షకుడు కేవలం నిస్సహాయుడైన నరమాత్రుడు కాదు గాని, దేవుడు-సర్వశక్తిగలవాడు, నిత్యుడు, సృజించి, పోషించు దేవుడై యున్నాడు.

రెండవది, మానవాళి కొరకు ఆయనకున్న ప్రేమను ప్రభువైన యేసుని ముందటి ఉనికిలోనే మనం చూచాం. ఆయన ఈ లోకంలోనికి రావడం, ఆయన మన పాపముల కొరకు మరణించడం, రక్షణకు ఏకైక నిరీక్షణగా మనకు ప్రసాదించబడింది. ప్రభువైన యేసు అవతరించి ఈ నిరీక్షణను మనకు దయచేయడానికి ఆయన యిష్టపడ్డాడు. మన రక్షణకొరకు ఆయన తన్ను తాను అర్పించుకొన్నాడు, అయితే భూనివాసులు ఆ సందేశాన్ని అంగీకరించి రక్షింపబడతారా? ప్రభువు తనకున్న ప్రతిదానిని వదలుకొన్నది ఒక చిన్న జవాబు కొరకేనా? ఆయన ఆ రిస్కు, శ్రమ అంతటిని తీసికొనడానికి యిష్టపడింది మనకొరకే. ఆయన మనకు రక్షకుడుగా రూపొందాడు. ఇంకెవరూ

మనలను రక్షించ లేరు. ఆయన వచ్చియుండకుంటే, మనకు నిరీక్షణ ఉండి యుండేదే కాదు.

నీవు ఒక చీమగా మారుతున్నట్టు ఊహించగలవా? మానవుడుగా ఉన్న నీ అనేకమైన ఆధిక్యతలను, అంటే నీ మానవ దేహాన్ని, నీ బలాన్ని, నీ తలాంతులను అన్నిటిని ప్రక్కన పెట్టివేయవలసివస్తుంది. చీమ హద్దులలో నీవు జీవించవలసి యుంటుంది. ప్రభువైన యేసు ఒక చీమగా మారలేదు. కాని పరలోకంలో తనకున్న అత్యున్నతమైన స్థితినుండి, పాలస్తీనాలో నరమాత్రుడుగా మారడమనేది, ఒక నరుడు చీమగా మారడంకంటే ఎంతో ఎక్కువగా తగ్గించుకున్నట్టౌతుంది. అవును, ప్రభువైన యేసు నరరూపు దాల్చింది మనం దేవుని కుమారులుగా చేయబడడానికే.[5]

ప్రభువైన యేసు మనకొరకు ఏమి చేశాడో దానియందు మనం ఆనందించుదాం. అంతేగాక, ఆయనకు లోబడి, ఆయనను అనుకరించడానికి యిప్పుడే తీర్మానించుకుందాం.

## పరిశీలనకైన ప్రశ్నలు

(*జవాబులు - 249వ పేజీలో*)

1. క్రొత్త నిబంధనలోని తొలి నాల్గు పుస్తకాలు దేనిని బయలుపరచుతాయి?
2. ప్రభువైన యేసు జన్మయే ఆయన ఆరంభమా?
3. యోహాను 1:1-5నుండి వెలువడిన నాలుగు గొప్ప సత్యాలను పేర్కొనుము.
4. మనలో ఒకనివంటివాడుగా మారడానికి ప్రభువైన యేసు తగ్గించుకున్న నాలుగు విధాలేవి?
5. నీవు దానిని నమ్మినట్లయితే, మిగిలిన ప్రతి సత్యాన్ని నమ్మగలిగేలా చేసే క్రైస్తవ్యం యొక్క ఆ ప్రధాన సత్యమేది?
6. ప్రభువైన యేసుని జన్మ ఏ విధంగా ప్రత్యేకమైన జన్మ అయ్యింది?
7. ప్రభువైన యేసును గూర్చిన ఏ మూడు సత్యాలు మనమెన్నడు మరువరాదు?
8. ఒక మనిషి చీమగా మారేదానికంటే ప్రభువైన యేసు నరరూపు దాల్చడం ఎలా అత్యధికమైనదై ఉంటుంది?

## పద సహాయకారి

**నరావతారం –** దేవుని కుమారుడు సశరీరుడుగా ప్రత్యక్షుడవ్వడం; ప్రభువైన యేసు భూమిమీదికి వచ్చి నరమాత్రుడుగా జీవించడం.

**అంతరంగ నివాసం –** లోపల నివసించడం, క్రైస్తవులలో పరిశుద్ధాత్మ నివసించు తున్నట్టు లేక నివాసం చేస్తున్నట్టు (1 కొరింథీ. 6:19, 20).

**ముందుగా వసించుట –** లోకము పుట్టకమునుపే జీవించియుండడం. ఈ సహజ లక్షణం దేవత్వానికి మాత్రమే (తండ్రియైన దేవునికి, కుమారుడైన దేవునికి, ఆత్మయైయున్న దేవునికి) చెందుతుంది. నరావతారానికి ముందే ప్రభువైన యేసు ఉన్నారు. ఆయన నిత్యనివాసి, ఆయన ఎల్లప్పుడు – నిన్న, నేడు, నిరంతరం ఉన్నవాడు (యోహాను 1:1–11 చూడు).

---

[1]యోహాను తన సువార్త రచనను చరిత్రకు ముందునుండి ఆరంభించాడు. నిత్యత్వంలోని దేవునితో అతడు ఆరంభించాడు. [2]"అలెగ్జాంద్రియావాడైన ఫైలో లోగోస్‌ను గూర్చి చాలా చెప్పియున్నాడు. అతని విధానంలో లోగోస్ అనేది దేవునికి నరునికి మధ్య నిలిచిన సూత్రమైయుంది, కాని లోగోస్ మాత్రం శరీరధారియవ్వతాడన్న అవకాశాన్ని అతడు లేదన్నాడు, లోగోస్ సశరీరుడుగా ప్రత్యక్షుడయ్యాడని యోహాను అన్నప్పుడు, యితడు ఫైలో చెప్పినదానికి భిన్నమైన లోగోస్‌ను తెలియజేస్తున్నాడు. తన గొప్ప పాండిత్య మంతటితోపాటు, మనుష్యుల మధ్య నివసింపగలిగి, మనుష్యులను కార్యాలు జరిగించే వారిగా మార్పు చేసి, వారికి దేవుని కుమారులయ్యే అధికారాన్ని ప్రసాదింప సామర్థ్యముగల లోగోస్‌ను ఫైలో ప్రకటింపలేక పోయాడు. సమకాలిక గ్రీకు ప్రపంచంలో యిది ఒక క్రొత్త మూల పదార్థమైయుంది" (Donald Guthrie, *A Shorter Life of Christ* [Grand Rapids, Mich.: Zondervan, 1970], 73). [3]"దేవుడు మనిషిలో నివసించడం కాదు. అలాటివారు అనేకులున్నారు. మనిషి దేవుడుగా చేయడంకాదు. విగ్రహారాధికుల పురాణ గాథల పద్ధతియొక్క ఆలోచనల్లో తప్ప అలాటి వారెవరూ లేరు. కాని దేవుడు, మానవుడు, ఒకే వ్యక్తిత్వంలో రెండు స్వభావాలు మిళితమై, స్థిరమై గూఢమైనదియు, మర్మమైనదియునై యుండి వివరించగల అవకాశాన్నే చిక్కుపరచుతుంది'' (G. Campbell Morgan, *The Crises of the Christ* [Old Tappan, N.J.: Fleming H. Revell Co., 1936], 79). [4]J.I. Packer, *Knowing God* (Downers Grove, Ill.: InterVarsity Press, 1973), 46. [5]"సమస్తము నెరిగినవాడును, విశ్వమంతటిని సృజించినవాడునైన నిత్యనివాసి కేవలం మానవ మాత్రుడవ్వడం మాత్రమే కాదు (దానికి ముందు) ఒక శిశువుగా, దానికి ముందు స్త్రీ గర్భంలో ఒక పిండముగా రూపొందాడు. నీవు దాన్ని సరిగా గ్రహించాలనుకుంటే, నీవు ఒక పీతలా లేక ఒక చిన్న నత్తలా రూపొందాలనే తలంపును గూర్చి ఆలోచించు" (C.S. Lewis, *Mere Christianity*, rev. ed. [New York: Macmillan Publishing Co., 1952], 155).